క్లుప్తంగా

నేటి నుంచి 30 పోలీసు యాక్ట్ అమలు

ఒంగోలు టౌన్: శాంతి భద్రతలలో భాగంగా బుధవారం 1 అక్టోబర్ నుంచి 31వ తేదీ వరకు నగరంలో 30 పోలీసు యాక్ట్ అమలు చేస్తున్నట్లు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు, ఇతర సంస్థలు పోలీసుల అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించరాదని తెలిపారు. ఏదైనా కార్యక్రమం నిర్వహించాలంటే ముందస్తుగా పోలీసుల అనుమతి తీసుకోవాలని, నిబంధనలకు వ్యతిరేకంగా ప్రవర్తించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ తగదు


నిరసన తెలుపుతున్న నాయకులు

సంతనూతలపాడు(చీమకుర్తి రూరల్): రాష్ట్రంలోని మెడికల్ కాలేజీలను ప్రభుత్వమే నిర్మించి నిర్వహించాలని, పీపీపీ విధానం నిలిపేయాలని సంతనూతలపాడు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం పార్టీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో ఒంగోలు కలెక్టర్ వద్ద నిర్వహించిన ధర్నాకు నియోజకవర్గ నాయకులు తరలివెళ్లారు. కలెక్టరేట్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మెడికల్ కాలేజీపై ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో పార్టీ ఎస్సీ సెల్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మూరి కనకారావు, ఎస్ఎన్పాడు మండల అధ్యక్షుడు దుంపా చెంచిరెడ్డి, ఎస్సీ సెల్ జాయింట్ సెక్రటరీ దుడ్డు వినోద్, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు తేళ్ల పుల్లారావు, నాయకులు దేవప్రసాద్, వెంకట సుబ్బయ్య, ఋషి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఎలుకల మందు తిన్న రౌడీ షీటర్

ఒంగోలు టౌన్: మద్యం మత్తులో ఒక రౌడీ షీటర్ ఎలుకల మందు తిన్నాడు. సేకరించిన వివరాల ప్రకారం.. నగరంలోని దేవుడు చెరువుకు చెందిన రౌడీ షీటర్ మద్దాల డేవిడ్ ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఇటీవల కొంత కాలంగా భార్యా భర్తల మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. దాంతో భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. మనోవేదనకు గురైన డేవిడ్ సోమవారం రాత్రి 9.45 గంటల సమయంలో ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్ కొండమీదకు వెళ్లాడు. మద్యం తాగిన మత్తులో ఎలుకల పేస్ట్ తిన్నాడు. ఈ విషయం తెలుసుకున్న మిత్రులు వెంటనే అతడ్ని జీజీహెచ్ కు తరలించారు. ప్రస్తుతానికి డేవిడ్ ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు

ముగిసిన త్రయాహ్నిక ఉపన్యాస యజ్ఞం

ఒంగోలు మెట్రో: అవిద్యను అంతమొందించటానికి లలితాపరా భట్టారిక దశమహా విద్యలుగా అవతరించిందని ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు, ప్రముఖ ఆధ్యాత్మిక ఉపన్యాసకుడు పొన్నూరు వేంకట శ్రీనివాసులు అన్నారు. కేశవస్వామిపేటలోని ప్రసన్న చెన్నకేశవస్వామి దేవస్థానంలో మంత్రి ప్రగడ నరసింహారావు త్రయాహ్నిక ఉపన్యాస యజ్ఞంలో మూల నక్షత్రాన్ని పురస్కరించుకొని శ్యామలా వైభవంపై ప్రసంగించారు. ముందుగా దేవస్థానం ఈఓ రావెళ్ల శివంకర్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆధ్యాత్మిక సేవలందిస్తున్న అతిథులను నిర్వాహకులు మంత్రిప్రగడ ప్రసాద్ సంస్థ తరఫున ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అన్నమయ్య సంగీత సేవాసమితి అధ్యక్షులు ఐ.మురళీకృష్ణ, అక్కినేని కళాపరిషత్ అధ్యక్షులు కృష్ణయ్య గాయకులు పాల్గొన్నారు.

అమ్మ శక్తి అనంతం..
తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు జరిగే సాంస్కృతిక కార్యక్రమాలు ఒంగోలు మున్సిపల్ దిబ్బల రోడ్డులోని అనంత కోదండరామ స్వామి దేవస్థానంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ఉపన్యాసకుడు నెమ్మాని సీతారామమూర్తి అమ్మవారి తత్వ వైభవం వర్ణించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు వేమూరు శ్రీనివాసరావు, రావినూతల రామకృష్ణ, ఆలయ కమిటీ సభ్యులు, అర్చక స్వాములు, స్థానిక భక్తులు పాల్గొన్నారు.

దుర్గమ్మా.. కరుణించవమ్మా!


అచలానందాశ్రమంలో గోవిందమాంబ అమ్మవారు


దుర్గాదేవి అలంకరణలో లాయరుపేట సాయిబాబా ఆలయంలోని రాజరాజేశ్వరీదేవి..


కరెన్సీ నోట్లతో అలంకరణలో కేశవస్వామిపేట వేపచెట్టు కనకదుర్గాదేవి అమ్మవారు


కనకదుర్గ మండపం సన్నిధిలో దుర్గమ్మ ప్రతిమ దీపాలలో మహిళలు

- దుర్గమ్మ రూపంలో మహాచండీ దర్శనం
- గాజుల అలంకరణలో దుర్గమ్మ
- మండపాలలో విశేష పూజలు, భజనలు
- అమ్మవార్లకు సారే, నైవేద్యాలు సమర్పించిన భక్తులు

ఒంగోలు మెట్రో: దసరా శరన్నవరాత్రులు ఒంగోలు నగరంలో అంగరంగ వైభవంగా జరగుతున్నాయి. నగరంలోని దుర్గమ్మ మండపాలలో అమ్మవారికి విశేష పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. సాయంత్రం భవాని దీక్షాపరులు దుర్గమ్మ సన్నిధిలో భజనలు కీర్తనలతో భక్తులను ఆకట్టుకుంటున్నారు. సాయంత్రం సంస్కృతిక కార్యక్రమాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఒంగోలు నగరంలో పలు ఆలయాలలో అమ్మవారు కనకదుర్గాదేవిగా అలంకరణలో భక్తులను దివ్యదర్శనంతో అనుగ్రహించారు. ఉదయం నుంచి భక్తులు కుటుంబ సమేతంగా పాల్గొని ఎరుపు రంగు, ఎరుపు పూలతో అలంకరించిన దుర్గమ్మ దర్శనం చేసుకున్నారు. అమ్మవారికి ఇష్టమైన కట్టె పొంగలి బెల్లం, అన్నం, రవ్వ, కేసరి, పులిహోర, పసుపు కుంకుమ, సారే సమర్పించుకొని ఆనంద అనుభూతి పొందారు. కొత్తపట్నం బస్టాండ్ తూర్పు పాలెం శివాలయంలో రాజరాజేశ్వరస్వామి కాళికాదేవిగా దర్శనమిచ్చారు. ఒంగోలు మర్రిచెట్ల కాలనీలో దుర్గమ్మ మండపంలో కనకదుర్గమ్మకు శాకంబరీ దేవి అలంకరణగా చేసి కుంభహారతితో భక్తులకు అమ్మవారి దర్శన భాగ్యం కల్పించారు. కార్యక్రమంలో భవాని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దుర్గమ్మ అనుగ్రహం ఆశీస్సులు అందుకున్నారు.

శ్రీగిరిలో శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలు..
కొండమీద శ్రీగిరి వెంకటేశ్వర స్వామి శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలు మంగళవారం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకుడు, వేద పండితులు శ్రీవారికి తోమాల సేవ, తులసి దళాలతో సహస్ర నామార్చన నిర్వహించారు. శ్రీవారికి హనుమంత వాహనసేవ నేత్ర పర్వంగా జరిగింది. హనుమంత వాహనంపై ఉభయ దేవేరులతో పాటు కొలువు తీరిన శ్రీవారిని భక్తులు తనివితీరా దర్శించి పులకిత గాత్రులయ్యారు. ప్రముఖ ఆధ్యాత్మిక ఉపన్యాసకులు సాహితీ వాచస్పతి, విశ్రాంత తెలుగు అధ్యాపకులు బహుముఖ ప్రజ్ఞాశాలి మొవ్వ వృషాద్రిపతి (రేపల్లె) వెంకటేశ్వరస్వామి వైభవంతో పాటు శరన్నవరాత్రులలో జగన్మాత ఆరాధన వల్ల కలిగే సత్ఫలితాల గురించి భక్తులకు చక్కగా వివరించారు. దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి, ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలా దేవి, కార్య నిర్వహణ ధర్మకర్త సి వి రామకృష్ణారావు, ధర్మకర్తల మండలి ప్రతినిధులు వృషాద్రిపతిని ఘనంగా సత్కరించారు.

బంగారమ్మతల్లికి గ్రామోత్సం..
కొత్తపట్నం: దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని గ్రామ దేవత బంగారమ్మ తల్లికి గ్రామోత్సవం నిర్వహించారు. మండలంలో కె.పల్లెపాలెం గ్రామంలో జెడ్పీటీసీ సభ్యురాలు సైకం లక్ష్మీ శారద ఆధ్వర్యంలో మహిళలతో పానకం బిందెలతో తలపై పెట్టుకుని గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామంలో బంగారమ్మ గుడి నుంచి బీచ్ రోడ్డు, ఆంజనేయ విగ్రహం నుంచి రాముడు ఆలయం వరకు, దక్షిణం పాలెం, ఉత్తరపాలెంలో గ్రామోత్సవం నిర్వహించారు.


శ్రీగిరిలో హనుమ వాహనంపై దేవదేవుడు


గడియారంవారి వీధిలో సామూహిక కుంకుమార్చనలో మహిళా భక్తులు


అచలానందాశ్రమంలో పూజల్లో పాల్గొన్న భక్తులు


లాయరుపేట సాయిబాబా ఆలయంలో శాస్త్రీయ నృత్యం చేస్తున్న చందు డాన్స్ అకాడమీ విద్యార్థినులు


కె.పల్లెపాలెంలో బంగారమ్మతల్లి గ్రామోత్సవంలో జెడ్పీసీ శారద, మహిళలు




బాలాజీరావుపేటలో నగరోత్సవంలో కనగదుర్గా కళారం ..

ఆకట్టుకున్న కళారాల నగరోత్సవం

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నగరంలో అమ్మవారి కళారాలు అంగరంగ వైభవంగా నగరోత్సవం నిర్వహించారు. మంగళవారం అర్ధరాత్రి వివిధ రూపాల్లో కళారాలను ఊరేగించారు. బాలాజీరావుపేటలో కనగదుర్గా కళారాలు, అంకమ్మపాలెంలో కాళికాదేవి కాళారాల నగరోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో హాజరై తిలకించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

- ఫొటోలు సాక్షి ఒంగోలు


నగరోత్సవంలో వివిధ వేషధారణలో ..


అంకమ్మపాలెం కాళికాదేవికళారాల నగరోత్సవంలో పాటలు పాడుతున్న గాయకులు

కూటమి నాయకుల బరితెగింపులు

- టీడీపీ నాయకుల కొమ్ముకాస్తున్న మున్సిపల్ అధికారులు
- చెరువుకొమ్ముపాలెంలో డ్రైనేజీ నిర్మాణంలో వివక్ష
- 18వ డివిజన్లో టీడీపీ నాయకుడి అరాచకం
- డ్రైనేజీ కాలువ నిర్మాణ పనుల్లో రూ.20 లక్షలు నొక్కేసే కుట్ర
- పెళ్లూరులో సాగు, తాగునీటి చెరువుకు డ్రైనేజీ నీళ్ల మళ్లింపు

ఒంగోలు సబర్బన్: అది చెరువుకొమ్మపాలెం. వీఐపీ డివిజన్ (18) పరిధి. ఇక్కడ మేయర్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ డివిజన్ పరిధిలో అన్నీ అడ్డగోలు నిర్ణయాలే. ఈ డివిజన్లో సుమారు రూ. 4 కోట్లతో పనులు జరుగుతున్నాయి. ఈ పనులన్నీ అధికార తెలుగుదేశం పార్టీ, ప్రజాప్రతినిధి ముఖ్య అనుచరుడి కనుసన్నల్లోనే జరుగుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. పేరుకే అక్కడ కాంట్రాక్టర్ ఉంటారు కాని అంతా చక్కబెట్టేది అంతా ఆయనే అన్న ప్రచారం జోరుగా సాగుతోంది. ఒక వైపు మేయర్, మరో వైపు అధికార పార్టీ ప్రజాప్రతినిధి అండదండలు ఉండటంతో సదరు వ్యక్తి చెప్పిందే వేదంగా సాగుతోందన్న విమర్శలు ఉన్నాయి. అంతేకాకుండా తన మాట వినని వాళ్లని పచ్చనేత పోలీసులతో బెదిరిస్తున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా డ్రైనేజీ పనులు..
ఒంగోలు నగర పాలక సంస్థ అధికారులు చెరువుకొమ్మపాలెంలో డ్రైనేజీ నిర్మాణ పనులు నిబంధనలకు విరుద్ధంగా చేస్తున్నారు. టెండర్ ప్రకారం కాంట్రాక్టర్ గాయం శ్రీనివాసరెడ్డి చేయాల్సి ఉంది. కానీ ఆ పనులను టీడీపీ డివిజన్ నాయకుడు చేస్తున్నాడన్న ఆరోపణలు ఉన్నాయి. డ్రైనేజీ కాలువ తీయాలనుకుంటే జేసీబీతో చిన్న తొట్టి పెట్టుకొని మట్టిని తొలగించాలి. కావాలని పెద్ద తొట్టిలతో మట్టి తీస్తుంటే ఇళ్ల గోడలు కూడా బీటలు వారుతున్నాయని, కావాలనే రాజకీయ కక్షలతోనే ఈ పనులు చేస్తున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామానికి చెందిన వాకా మహా లక్ష్మమ్మ ఇంటి ప్రహరీని పూర్తిగా కూల్చారు. ఇదేంటని అడిగితే ఒక్క రూపాయి కూడా నష్ట పరిహారం ఇవ్వం అని బెదిరిస్తున్నారు.


అడ్డగోలుగా తవ్విన కాలువ

టీడీపీ నాయకుల ఇళ్ల వద్ద ఒక రకంగా..
ఇక్కడ టీడీపీ నాయకుడు డ్రైనేజీ పనులు చేపట్టటంతో వాళ్ల పార్టీ ఇళ్ల వద్ద ఒకరకంగా.. మరొకరి ఇళ్ల వద్ద మరో విధంగా కాల్వ తవ్వుతున్నారు. సాధారణంగా మెరక నుంచి పల్లంలోకి వర్షపు నీరు కానీ, మురుగు నీరు కానీ ప్రవహించాలి. కాని అందుకు వ్యతిరేకంగా కాలువ తీస్తున్నారు. డ్రైనేజీ కాలువను నిబంధనలకు వ్యతిరేకంగా నాలుగైదు అడుగుల్లోతు తీస్తున్నారు. పెళ్లూరు చెరువు అలుగు పారితే చెరువు కొమ్ము పాలెం లోకి నీరు వచ్చేప్రమాదం ఉందని కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అధికారులపై జాయింట్ కలెక్టర్ ఆగ్రహం..
చెరువుకొమ్ముపాలెంలో నిర్మించే డ్రైనేజీ కాలువ మురికి నీరు తాగు, సాగు నీటి చెరువు పెళ్లూరు చెరువుకు మళ్లించే విధంగా నగర పాలక సంస్థ అధికారులు డిజైన్ చేశారు. ఈ విషయమై గ్రామానికి చెందిన కొందరు సోమవారం జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణకు ఫిర్యాదు చేశారు. దాంతో జాయింట్ కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేసి కమిషనర్ వెంకటేశ్వరరావుపై, ఇంజినీరింగ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నీటిపారుదల శాఖ అధికారులను పిలిచి మున్సిపల్ అధికారులపై క్రిమినల్ కేసు నమోదు చేయండని ఆదేశించారు. మురుగు నీరు చెరువుకు ఏ విధంగా పెడతారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

బలంగా ఉన్న డ్రైయిన్లను కూల్చి మరీ..
చెరువుకొమ్ముపాలెంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో బలంగా నిర్మించిన డ్రైనేజీని జేసీబీలతో పగులగొట్టి మరీ పనులు చేస్తున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో కట్టిన ఏ ఒక్కటి కూడా ఉండకూడదని కక్షగట్టి మరీ టీడీపీ నాయకులు కూలుస్తున్నారు. అందుకు నగర పాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగం అధికారులు, కమిషనర్ కళ్లప్పగించి చూస్తున్నారే తప్ప పట్టించుకోవడం లేదు. చెరువుకొమ్ము పాలెంలో నిర్మించనున్న డ్రైయిన్లకు ఇంజినీరింగ్ అధికారులు రూ.40 లక్షలు కేటాయించారు. రూ.40 లక్షల డ్రైనేజీ కాలువ నిర్మాణ పనుల్లో ఆ పచ్చనేత రూ.20 లక్షలు నొక్కేసే కుట్ర జరుగోంది. ఇనుము వాడకుండానే డ్రైనేజీ కాలువ నిర్మాణాలు చేస్తున్నారు.


స్థానికులను బెదిరిస్తున్న పోలీసులు

ఇనుము అన్ని చోట్ల వాడాల్సిన అవసరం లేదు..
డ్రైనేజీ కాలువలో అన్ని చోట్ల ఇనుము వాడాల్సిన అవసరం లేదు. వెడల్పును బట్టి వాడుతాం. గోడలు కూలిపోయిన విషయం మా దృష్టికి రాలేదు. మా ఇంజినీర్లు అక్కడే ఉండి పనిచేస్తున్నారు. కాంట్రాక్టర్ గాయం శ్రీనివాస రెడ్డి దగ్గరుండి పనిచేయిస్తున్నారు. ఎవరికీ బినామీలకు కాంట్రాక్టు పనులు అప్పగించలేదు. పెళ్లూరు చెరువుకు మురుగు పోయే విషయంలో జాగ్రత్తలు తీసుకుంటాం.
– పీ.ఏసయ్య, మున్సిపల్ ఇంజినీర్, ఒంగోలు నగర పాలక సంస్థ

భక్తులకు అసౌకర్యం కలగకుండా చూడాలి

- నగరంలోని ఆలయాలను పరిశీలించిన ఎస్పీ హర్షవర్ధన్ రాజు

ఒంగోలు టౌన్: జిల్లాలో దుర్గమ్మ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు పోలీసు అధికారులను ఆదేశించారు. దసరా నవరాత్రులు పూర్తయ్యేంత వరకు పోలీసులు అప్రమత్తంగా ఉండాలని, ఆధ్యాత్మిక వాతావరణాన్ని కాపాడాలని సూచించారు. మంగళవారం నగరంలోని పలు దేవాలయాలను పర్యటించిన ఎస్పీ ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. బాలాజీరావు పేటలోని పోలేరమ్మ ఆలయం, కనకదుర్గ దేవాలయాలలో బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. గంటపాలెం, మస్తాన్ దర్గా ప్రాంతాలలో ఊరేగింపు మార్గాన్ని పరిశీలించి పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. రద్దీ ప్రాంతాలలో అసాంఘిక కార్యకలాపాలకు తావివ్వకుండా సిసి కెమెరాలతో పర్యవేక్షించాలని, ఆకాశ మార్గంలో డ్రోన్ కెమెరాలతో నిఘా పెట్టాలని చెప్పారు. ఎస్పీ వెంట డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, ఎస్బీ సీఐ రాఘవేంద్ర, తాలుకా సీఐ విజయకృష్ణ, వన్టౌన్ సీఐ నాగరాజు, సింగరాయకొండ సీఐ హజరత్తయ్య, ట్రాఫిక్ సీఐ పాండురంగారావు ఉన్నారు.


ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు

ఉపాధ్యాయుడికి వీడ్కోలు



నాగమల్లేశ్వరరావును సత్కరిస్తున్న సహచర ఉపాధ్యాయులు

కొత్తపట్నం: తెలుగు ఉపాధ్యాయుడిగా ఎందరో విద్యార్థుల జీవితాల్లో వెలుగు నింపిన వ్యక్తి నాగమల్లేశ్వరరావు అని బహుజన టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అసోసియేసియేట్ అధ్యక్షుడు పర్రె వెంకట్రావు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడుగా పనిచేస్తోన్న అత్తలూరి నాగమల్లేశ్వరరావు మంగళవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈసందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న వెంకట్రావు మాట్లాడుతూ నాగమల్లేశ్వరరావు బహుముఖ ప్రజ్ఞాశాలి అని.. తెలుగు సాహిత్యంతో పాటు రచనలు కూడా చేశారన్నారు. నిజాయితీ, సమాజంలో గౌరవం, ఉపాధ్యాయులతో కలిసి మెలిసి ఉండటం ఎంతో మంచి పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. స్టాఫ్ సెక్రటరీ హరిబాబు మాట్లాడుతూ నాగమల్లేశ్వరరావు, హెచ్ఎం షేక్ మహబూబ్ఖాన్ మాట్లాడుతూ.. నాగమల్లేశ్వరరావు అప్పటికీ, ఇప్పటికీ అదే అంకిత భావం కనిపిస్తుందని అలాంటి ఉత్తమ ఉపాధ్యాయుడును సత్కరించుకోవడం ఎంతో సంతోషాన్నిస్తుందన్నారు. అనంతర నాగమల్లేశ్వరరావును శాల్వాతో సత్కరించారు. కార్యక్రమంలో హెచ్ఎం సాయికిషోర్, ఉపాధ్యాయుడు చెక్కా కోటేశ్వరరావు, ఎస్కే ఫయాజ్, భవనాదం శ్రీనివాసరావు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు యానాదిరావు, రాజు, సోమరాజు పాల్గొన్నారు.

ట్రంపు బరితెగింపునకు గుణపాఠం చెప్పాలి

ఒంగోలు టౌన్: వాణిజ్య విస్తరణ కాంక్షతో ఉన్మాదిగా ప్రవర్తిస్తున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్నకు అభివృద్ధి చెందిన దేశాల మద్దతుతో గుణపాఠం చెప్పాలని సీఐటీయూ నాయకుడు పూనాటి ఆంజనేయులు పిలుపునిచ్చారు. అమెరికా ఎగుమతి సుంకాలకు వ్యతిరేకంగా భారతదేశంలో వర్తక వాణిజ్య వర్గాలు–వ్యవసాయంపై దాని ప్రభావం అనే అంశం మీద మంగళవారం ఎల్బీజీ భవనంలో నిర్వహించిన సదస్సు నిర్వహించారు. రిటైర్డ్ ఏఎస్పీ ఎస్ సాయిబాబు, మారెళ్ల సుబ్బారావు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా నిలిచేందుకే డిజిటల్ బుక్


ఒంగోలులో డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు


డిజిటల్ బుక్ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

- ఒంగోలు వైఎస్సార్ సీపీ నగరాధ్యక్షుడు శంకరరావు

ఒంగోలు సిటీ: అన్యాయానికి గురైన కార్యకర్తలకు అండగా నిలబడేందుకే వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్రెడ్డి డిజిటల్ బుక్ రూపొందించారని ఒంగోలు వైఎస్సార్ సీపీ నగరాధ్యక్షుడు కఠారి శంకరరావు పేర్కొన్నారు. మంగళవారం ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో కఠారి శంకరరావు ఆధ్వర్యంలో డిజిటల్ బుక్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చట్ట బద్ధంగా, రాజ్యాంగ బద్ధంగా ఉన్న హక్కులను కూటమి ప్రభుత్వం కాలరాసిందని విమర్శించారు. ఎవరిపైన అయితే కేసులు పెట్టి ఇబ్బంది పడుతున్నారో వారి ఫిర్యాదులను పోలీసులు తీసుకునే పరిస్థితి ప్రస్తుతం కనిపించడం లేదన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలపై అక్రమకేసులు బనాయించి ఇబ్బంది పెడితే వారు వెంటనే డిజిటల్ బుక్ లో క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేసి వారి సమస్యను రిజిస్టర్ చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఒంగోలు నగర ఉపాధ్యక్షులు రోశయ్య, ఒంగోలు సిటీ లీగల్ సెల్ అధ్యక్షుడు సంపత్, వలంటీర్ విభాగ అధ్యక్షులు ఎస్.జనార్దనరెడ్డి, సిటీ మహిళా అధ్యక్షురాలు బత్తుల ప్రమీల, సిటీ దివ్యాంగుల విభాగం అధ్యక్షులు మీరావలి, కార్పొరేటర్ ఇమ్రాన్ఖాన్, కో ఆప్షన్ సభ్యులు శ్యాంసాగర్, 33, 11వ డివిజన్ అధ్యక్షులు మీరావలి, కిరీటి, నగర కల్చరల్ విభాగ అధ్యక్షులు సమీర్, బీసీ సెల్ అధ్యక్షుడు సుతారం శ్రీనువాసులు, నాయకులు గడ్డం బాలకోటయ్య, అసోది యలమందారెడ్డి, మధు, చానా, కరుణాకర్, జిలాని భాషా, పిగిలి శ్రీనివాసరావు, ఆనం శ్రీనివాసరెడ్డి, రమేష్బాబు, 31వ డివిజన్ అధ్యక్షుడు బాలకృష్ణ వీసం, సతీష్, అబ్దుల్ కుద్దుస్, అబ్దుల్ రజాక్, మద్దు ప్రతాప్, కరుణాకర్, జఫరుల్లా తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా డిజిటల్ బుక్ : వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మూరి కనకారావు
నాగులుప్పలపాడు: కూటమి నేతల దౌర్జన్యాలు, దాడులకు గురైన, వారి అక్రమాలతో నష్టపోయిన వారికి అండగా నిలిచేందుకు వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్రెడ్డి డిజిటల్ బుక్ అమల్లోకి తెచ్చారని ఆ పార్టీ ఎస్సీ సెల్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మూరి కనకారావు పేర్కొన్నారు. మంగళవారం నాగులుప్పలపాడులో పార్టీ నాయకులతో కలిసి డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కొమ్మూరి కనకారావు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వ దుర్మార్గ పాలనలో అన్యాయానికి గురైన ప్రతి ఒక్కరూ జగనన్న రూపొందించిన డిజిటల్ బుక్లో ఫిర్యాదు చేయవచ్చని, ప్రతి అంశం పార్టీ అధినేత పరిశీలనలో ఉంటుందని తెలిపారు. డిజిటల్ బుక్ ఆవశ్యకతను గ్రామ గ్రామాన అందరికీ తెలియజేయాలని పార్టీ నేతలు, కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పాలడుగు రాజీవ్, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు మారెళ్ల బంగారుబాబు, మండల అధ్యక్షుడు పోలవరపు శ్రీమన్నారాయణ, గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షుడు పోలినేని కోటేశ్వరరావు, విద్యార్థి విభాగం సంయుక్త కార్యదర్శి పాలపర్తి ప్రవీణ్, కాకర్ల సురేష్, తగిరిస సుబ్బారావు, పోతవరం, చవటపాలెం సర్పంచ్లు శీలం రేణుకా సురేష్, కాట్రగడ్డ వనజ శ్రీనివాసరావు, పోకూరి హరిబాబు, గండు వెంకట్రావు, వల్లంశెట్టి హనుమంతరావు, మోహనరావు, కోడె సుబ్బారావు, సామ్యేలు, వంశీ భార్గవ్, భాస్కరరావు, గండు హరిబాబు తదితరులు పాల్గొన్నారు.